HICON SERIES

CLASS 4 TELUGU

# జాతి పతాకం

LESSON 1






CLICK HERE TO ACTIVATE

LESSON 1

# 1 జాతి పతాకం

- దారా సుబ్బారావు



ఓ జాతి పతాకమా
నీ కిదిగో వందనం
ధృవతారల చిహ్నమా
నువ్వు అందుకో వందనం ॥ ఓ॥



నీలో ఉన్నవి రంగులు మూడు
కాషాయం కాదది ఎరుపే
అమరులు చిందించిన రక్తం
త్యాగశీలతను తెలిపే వర్ణం ॥ ఓ॥

పోరును సల్పి పీడను తుంచి
దోపిడి మూకల అంతును చూచి
శాంతిని తెత్తురు పేదలు ఒకటై
శాంతికి ప్రతీక తెలుపు వర్ణము ॥ ఓ॥



గంగా యమున కావేరమ్మల
చల్లని చూపుతో రైతు శ్రమించి
సస్యశ్యామలము కావించెదరు
సస్యతను తెలుపును పచ్చ వర్ణము ॥ ఓ॥



చక్రపు రేకుల చందంగా
జనత ఒక్కటిగా జీవిస్తూ
ఐక్యతగా ధర్మచక్రము
అందుకోవమ్మా మా వందనం ॥ ఓ॥



## భావం

స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణాలర్పించిన ఎందరో మహానుభావులు ధృవతారలై నిలిచారు. వారి గుర్తుగా ఎగురుతున్న ఓ జాతీయ జెండా! నీకు వందనం.

నీలో మూడు రంగులున్నాయి. మొదటిది కాషాయం, కాదది ఎరుపు రంగే. అమరులు చిందించిన రక్తానికి, త్యాగానికి గుర్తు. పేదలంతా ఒక్కటై పోరాడి, దోపిడీని నిలువరించి సాధించిన శాంతికి గుర్తు తెలుపురంగు. గంగ, యమున, కావేరి వంటి నదులతో, రైతు శ్రమతో సస్యశ్యామలమయ్యింది మన భరత భూమి. పచ్చని పైరుపంటలకు గుర్తు ఆకుపచ్చరంగు. మధ్యలో ఉన్న ధర్మచక్రం భారతీయుల ఐక్యతకు గుర్తు. ఇంతటి విశిష్టత కలిగిన భారత జాతీయ పతాకమా! నీకు వందనం.



## అభ్యాసం

### I. అర్థాలు

పతాకం = జెండా

తార = నక్షత్రం

చిహ్నం = గుర్తు

అమరులు = చావులేనివారు

వర్ణం = రంగు

ప్రతీక = గుర్తు

సస్యశ్యామలం = పచ్చని పైరు పంటలతో నిండినది

సస్యత = పంటలతో నిండి ఉండునది

జనత = ప్రజలు

### II. పదజాలం

**(అ) వ్యతిరేక పదాలు రాయండి.**

1. శాంతి × ________
2. చల్లని × ________
3. ఐక్యత × ________
4. పేదలు × ________
5. అమరులు × ________

**(ఆ) బహువచనాలు రాయండి.**

1. చిహ్నం – ________
2. జాతి – ________
3. నది – ________
4. రంగు – ________
5. మూక – ________

**(ఇ) క్రింది ఖాళీలను పూరించండి.**

1. ధృవతారల చిహ్నము ______________________ .
2. శాంతికి ప్రతీక ______________________ .
3. ______________________ ను తెలుపును పచ్చ వర్ణము.
4. త్యాగశీలతను తెలిపే వర్ణం ______________________.

**(ఈ) క్రింది పదాలతో సొంత వాక్యాలు రాయండి.**

1. ధృవతార : ______________________
2. జనత : ______________________
3. సస్యశ్యామలం : ______________________
4. ప్రతీక : ______________________

**(ఉ) జతపరచండి.**

| | | | |
|---|---|---|---|
| 1. కాషాయం | ( ) | (క) | పైరుపంటలు |
| 2. తెలుపు | ( ) | (గ) | ఐక్యత |
| 3. ఆకుపచ్చ | ( ) | (చ) | త్యాగం |
| 4. ధర్మచక్రం | ( ) | (జ) | శాంతి |

## III. ప్రశ్నావళి

**(అ) ఈ క్రింది ప్రశ్నలకు ఒకటి లేక రెండు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. జాతీయ జెండాలో ఎన్ని రంగులు ఉన్నాయి ?
2. జాతీయ పతాకంలో తెలుపు రంగు దేనిని తెలియజేస్తుంది ?
3. ఆకుపచ్చ రంగు దేనిని తెలియజేస్తుంది ?
4. జాతీయ జెండాలో భారతీయుల ఐక్యతను తెలిపేది ఏది ?

**(ఆ) ఈ క్రింది ప్రశ్నలకు ఐదు లేక ఆరు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. "జాతి పతాకం" గేయ సారాంశాన్ని సొంత మాటల్లో రాయండి.
2. భారత జాతీయ జెండా విశిష్టతను తెలియజేయండి.

## IV. వ్యాకరణం

మూడవ తరగతిలో వర్ణమాల నేర్చుకొని, ద్విత్వాక్షరాలు, సంయుక్తాక్షరాలు గూర్చి తెలుసుకొన్నారు గదా!

**(అ) ఈ క్రింది పేరాను చదివి పట్టికను నింపండి.**

సంక్రాంతి పండుగకు నెలరోజుల ముందునుంచే అంటే ధనుర్మాసం మొదలైనప్పటి నుండి సన్నాహాలు మొదలవుతాయి. స్త్రీలు వేకువనే నిద్రలేచి ఇండ్ల ముందు పెద్ద పెద్ద రంగవల్లులు వేస్తారు. వాటి మధ్యలో ఆవు పేడతో గొబ్బెమ్మలు పెడతారు. ముగ్గుల మీద పసుపు, కుంకుమ, బంతిపూలు చల్లుతారు. ఆడపిల్లలు గొబ్బెమ్మల చుట్టూ తిరుగుతూ గొబ్బి పాటలు పాడుతారు.

| అచ్చులతో మొదలయ్యే పదాలు | హల్లులతో మొదలయ్యే పదాలు | సంయుక్తాక్షరాలు ఉన్న పదాలు | ద్విత్వాక్షరాలు ఉన్న పదాలు |
|---|---|---|---|
| | | | |

## V. ప్రాజెక్టు పని



ఏవైనా ఐదు దేశాల జాతీయ జెండాలు సేకరించి చార్టుపై అంటించి, దేశాల పేర్లు రాయండి.